ఇంటింటికీ సంక్షేమం సీఎం వైఎస్ జగన్ ఘనత

- ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్
- బాపులపాడు సచివాలయం–2లో గడప గడపకు మన ప్రభుత్వం


బాపులపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చటంతో పాటుగా ఎన్నికల్లో చెప్పని సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడులోని గ్రామ సచివాలయం–2 పరిధిలో గుడివాడరోడ్డు, విజయవాడ రోడ్డులో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయం అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరించారు. గడిచిన మూడేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఎదురేగి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. డ్రెయినేజీ నిర్మాణం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్లు మంజూరు కోసం ఎమ్మెల్యే వంశీమోహన్‌కు పలువురు విజ్ఞప్తి చేశారు. పేద విద్యార్థుల చదువుకు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు ఆయన సొంత నిధులను సాయంగా అందించారు. గుడివాడరోడ్డులో రూ.6 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, స్టేట్ బ్యాంక్ వీధిలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బందితో సమావేశమై ప్రజల విజ్ఞప్తులపై చర్చించారు. వైఎస్సార్ సీపీ నాయకులతోనూ ఆయన సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని, వెళ్లిన ప్రతిచోట లబ్ధిదారులు ప్రభుత్వం పాలన పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే వంశీమోహన్ చెప్పారు. నాడు–నేడు, అమ్మ ఒడి, రైతుభరోసా వంటి విప్లవాత్మక సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, గన్నవరం ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, గన్నవరం, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నాగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంపీటీసీ సభ్యురాలు నూకల జ్యోతి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దయాల విజయనాయుడు, పీఏసీఎస్ చైర్మన్లు మూల్పూరు ప్రభుకాంత్, చిన్నాల సత్యగణేష్‌బాబు, కొల్లి బ్రహ్మారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, కోడెబోయిన బాబి, నన్నపనేని చలపతిరావు, గంధం నారాయణ, వార్డు సభ్యుడు గంధం రామారావు, ఎంపీడీవో ప్రభాకరరావు, ఆర్ఐ.రాజేష్, ఏఈలు ఎ.శ్రీనివాసరావు, డి.జయరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బూత్ స్థాయి అధికారులకు నిధుల విడుదల

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పోలింగ్ బూత్ స్థాయి ఆఫీసర్లకు ప్రభుత్వం గౌరవవేతనం విడుదల చేసిందని మండల తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్ తెలిపారు. మండలంలో గన్నవరం నియోజకవర్గం పరిధిలో 77 మంది పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు మూడు క్వార్టర్లకు, క్వార్టర్‌కు రూ.725 చొప్పున విడుదలైందన్నారు. మైలవరం నియోజకవర్గంలోని 52 మంది పోలింగ్ బూత్ స్థాయి ఆఫీసర్లకు రెండు క్వార్టర్లకు గాను ఒక క్వార్టర్‌కు రూ.720, రెండో క్వార్టర్‌కు రూ.650 చొప్పున విడుదలయ్యాయని తహసీల్దార్ తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

విజయవాడ రూరల్: రబీ పంటలను సాగు చేస్తున్న రైతులు కూడా ఆ పంట వివరాలతో ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఎంఈవో రంగనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ పంటలను సాగు చేసే పంటలను ఫొటోలు తీస్తారన్నారు. రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్‌పుస్తకం, బ్యాంక్ పుస్తకం వివరాలు తెలపాలని ఆయన సూచించారు.

వెయ్యి ఎకరాల్లో రబీ సాగు

విజయవాడ రూరల్ మండలంలో ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల్లో రబీసాగు జరిగిందన్నారు. జొన్నపంటను కూడా రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. మూడువేల ఎకరాల్లో రబీ సాగు జరిగే అవకాశం ఉందన్నారు. అందుకు సరిపడా నారుమళ్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసు నమోదు

పెనమలూరు: కోడి పందేల నిర్వాహకులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కోడి పందేలు నిర్వహించే యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన షేక్ రబ్బాని, చిన్నంశెట్టి రవికుమార్, వెలిశిల కోటినాగులు, నడకుదుటి నాగశ్రీను, షేక్ ఆదిల్‌బాషా, తాడిగడప శ్రీనివాసనగర్‌కు చెందిన కన్నా అనిల్‌పై కేసు నమోదు చేసినట్టు పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కంకిపాడు: దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఎంపీడీఓ పి.అనూష అన్నారు. పట్టణంలోని ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో గల భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. కేంద్రాన్ని ఎంపీడీఓ అనూష ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న సేవలు, మౌలిక వసతులను ఐఈ రిసోర్సు టీచర్లు ఎం.దీప్తి, పీవీడీ నాగేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయటం ద్వారా సాధారణ చిన్నారుల మాదిరిగా దివ్యాంగ చిన్నారులు వారి పనులు వారు చేసుకునే ఆస్కారం ఉంటుందని, విద్యలో రాణిస్తారని వివరించారు.

కవిత్వం సామాజిక అంశాల సమాహారం

విజయవాడ కల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని, కవిత్వంలో ప్రజావేదన కనిపించాలని ఆచార్య కొలకలూరి స్వరూపరాణి అన్నారు. మద్దూరి బహుజన రచయితల వేదిక, దళిత చైతన్య స్రవంతి, సామాజిక న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం మద్దూరి నగేష్‌బాబు స్మారక పురస్కార సభను నిర్వహించింది. సాహితీ విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య, కవి శిఖా ఆకాష్, చప్పిడి కోటేశ్వరరావు ప్రసంగించారు. 2022 సంవత్సరానికి గానూ మద్దూరి నగేష్‌బాబు స్మారక ప్రధాన పురస్కారాన్ని పి.శ్రీనివాస గౌడ్ రచించిన ధైర్యవచనం కవితా సంపుటికి, స్ఫూర్తి పురస్కారాలకు సరికొండ నరసింహరాజు నెత్తుటిపాదాలు, డాక్టర్ గూటం స్వామి కవితా సంపుటి తిప్పుడు పొట్లాం, అవనిశ్రీ కవితా సంపుటి ధిక్కార ఖడ్గం, అమూల్యాచందు రచన ఒంటిరొమ్ముతల్లి, సుంకర గోపాల్ రచించిన మానాయన పాటకు పురస్కారాలను అందజేశారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం


రామకృష్ణకు ఆర్థిక సాయం అందజేస్తున్న తోట

గన్నవరం: గొంతు క్యాన్సర్ వ్యాధి బారినపడిన సావరగూడెం గ్రామస్తుడు మారెళ్ళ రామకృష్ణకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాపు ఐక్య సమ్మేళనం అధ్యక్షుడు తోట వెంకయ్య ఆర్థిక తోడ్పాటును అందించారు. స్థానిక ఐక్య సమ్మేళనం కార్యాలయంలో మంగళవారం రామకృష్ణ వైద్యానికి రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ..తాపీ కార్మికుడైన రామకృష్ణ కొంత కాలంగా గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని చెప్పారు. ఇటీవల ఆతనికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత ఆపరేషన్ జరిగినట్లు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన రామకృష్ణ వైద్య అవసరాలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని సాయం చేసినట్లు చెప్పారు. సీఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి స్ఫూర్తితో పేద వర్గాల విద్య, వైద్య, ఉపాధి అవసరాలకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కాపు ఐక్య సమ్మేళనం నాయకులు గోపిశెట్టి వీరాస్వామి, దామెర సీతారామయ్య, వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ పామర్తి మాధవ్, గ్రామస్తులు బోయిన జగదీశ్వరరావు, సిరివెళ్ళ రాజా, ఎల్వీ.గంగాధర్, దొండపాటి కొండ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరోగ్య సమాచారం సేకరణ


తెంపల్లి సచివాలయం వద్ద అధికారులతో వైద్యుల బృందం

గన్నవరం రూరల్: ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తుందని తెంపల్లి గ్రామ సర్పంచ్ కొలుసు శిరీషా పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ ఆస్పత్రి వైద్య బృందం 50 మంది గ్రామంలో ఇంటింటికీ పర్యటించి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితులను నమోదు చేశారు. తెంపల్లిని దత్తత గ్రామంగా స్వీకరించిన డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సత్యకిషోర్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన పెంచటం, సకాలంలో వారికి వైద్య సేవలు అందించటం, ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి చేయటం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఒక్కొక్కరు 5 గృహాలకు వెళ్లి ఆ కుటుంబాలతో మాట్లాడి వారి ఆరోగ్య సమాచారం నమోదు చేశారు. సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని, ఏఎన్ఎం మంజుల, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

గన్నవరం: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ ఆర్.బాలస్వామి ఎన్నికయ్యారు. స్థానిక ఏపీఎన్జీవోస్ హోమ్‌లో మంగళవారం ఎన్నికల అధికారి ముక్కామల శ్రీనివాసరావు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గన్నవరం ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె. సతీష్, ప్రధాన కార్యదర్శిగా వీరవల్లి జెడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ బీ. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా గన్నవరం జెడ్పీ బాలికల హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ ఎం.కృష్ణశ్రావణి, కోశాధికారిగా కానుమోలు జెడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ ఎం.సురేంద్రదేవ్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా టీవీ.నాంచారయ్య (జెడ్పీహెచ్ఎస్, మానికొండ), సీహెచ్. సురేష్‌కుమార్ (ల్యాబ్ అసిస్టెంట్లు) ఎన్నుకున్నారు.

భూ సర్వేతో రైతులకు మేలు

తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంపై రైతులకు అందోళన చెందవద్దని బాపులపాడు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాదాపు వంద ఏళ్ల తర్వాత ప్రభుత్వం సమగ్ర భూ రీసర్వే చేపట్టిందని, దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కానీ కొన్ని చోట్ల దీనిపై లేనిపోని అపోహలు సృష్టించి రైతులకు అందోళన కలిగిస్తున్నారని చెప్పారు. భూ యాజమానుల పత్రాలను పరిశీలించి, సమగ్ర రీసర్వే నిర్వహించిన తర్వాతే వారికి నోటీసులు అందిస్తున్నామని చెప్పారు. భూ విస్తీర్ణం, సర్వే నంబర్లలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే రైతులు తిరిగి అర్జీ పెట్టుకునేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ నరసింహరావు చెప్పారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో జరిగిన సమగ్ర రీసర్వేలో కొన్ని పొరపాట్లు జరిగినట్లుగా రైతులు భావిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పర్యవేక్షణలో మండల సర్వేయర్, వీఆర్వో, గ్రామ సర్వేయర్, వీఆర్ఏలతో ప్రత్యేక బృందాన్ని రీ సర్వే నిమిత్తం నియమించామని వివరించారు.

పోరంకిలో పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: పోరంకిలో పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సాలిపేటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు శిబిరంపై దాడి చేశారు. పోలీసుల దాడిలో పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.36,100 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం



పెనమలూరు: మహిళల భద్రత ప్రభుత్వ లక్ష్యమని తాడిగడప మున్సిపాలిటీ మహిళా సంరక్షణ కార్యదర్శులు తెలిపారు. తాడిగడప కృష్ణవేణి జూనియర్ కళాశాలలో మంగళవారం దిశ యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు భద్రత కల్పించటానికి దిశ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యార్థినులు దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు పి.శృతి, ఎస్.రత్నకుమారి, ఇంతియాజ్ బేగం, ఎ.సుమతి పాల్గొన్నారు.

గోదాదేవికి విశేష అర్చనలు



దావాజిగూడెం (గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కూడారై పాశుర గానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో తెల్లవారుజామున శ్రీకృష్ణస్వామికి, శ్రీగోదాదేవి అమ్మవారికి విశేష అర్చనలు జరిపారు. అనంతరం 108 గంగాళాల పాయసంను స్వామివారికి నివేదించారు. వేడుకలో భాగంగా శ్రీకృష్ణస్వామికి, శ్రీగోదాదేవి అమ్మవారికి పూలతో జరిపిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఆకునూరు హైస్కూల్ సందర్శించిన పీఎంశ్రీ పరిశీలకుడు


ఆకునూరు హైస్కూల్‌ను సందర్శిస్తున్న పీఎంశ్రీ రాష్ట్ర ప్రత్యేక పరిశీలకుడు ఎం.సాయిరాం

ఉయ్యూరు: విద్యార్థుల బంగారు భవిత ఉపాధ్యాయుల లక్ష్యం కావాలని బాల భవన్ డైరెక్టర్, పీఎం శ్రీ రాష్ట్ర ప్రత్యేక పరిశీలకుడు ఎం.సాయిరాం అన్నారు. మండలంలోని ఆకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కడవకొల్లు ఎంపీయూపీ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అకుంఠిత దీక్షతో పనిచేయాలన్నారు. విద్యార్థుల భవితకు మార్గనిర్దేశకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంఓ శ్యాం, ఎంఈఓ పద్మారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్త గ్రూపుల నిర్ధారణ పరీక్షలు


రక్తదాన ఆవశ్యకతను వివరిస్తున్న శంకర్‌నాథ్

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారులోని వీకేఆర్ కళాశాలలో మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త గ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు 18 ఏళ్లు నిండిన యువత స్వచ్ఛందంగా ముందుకురావాలని కోరారు. ఒకరు చేసే రక్తదానం అపదలో ఉన్న ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. సొసైటీ గన్నవరం శాఖ చైర్మన్ చిన్ని మాధవీ మాట్లాడుతూ..మండలంలోని పలు కళాశాలలో రక్తదాన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీకేఆర్ కళాశాలలో 300 మంది విద్యార్థులకు రక్త గ్రూపులను నిర్ధారించి కార్డులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ సాయిఅరుణ్, జీవిత కాల సభ్యులు డాక్టర్ ఎం.విజయకుమార్, స్వర్ణకుమారి, ప్రభాకరచౌదరి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


బొమ్మల కొలువులో శ్రీ విద్యాలయ చిన్నారులు


బహుమతులు అందజేస్తున్న మౌనిక, షీలా

కంకిపాడు: ఈడుపుగల్లులోని శ్రీ విద్యాలయ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శిరీష భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ముచ్చటైన రంగవల్లులను తీర్చిదిద్దారు. బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కథాలాపం ఆకట్టుకున్నాయి.

సంక్రాంతి రంగవల్లికల పోటీలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, బాలికలు రంగు రంగుల సంక్రాంతి రంగవల్లికలను తీర్చిదిద్దారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చెరుకూరి షీలా, పంచాయతీ కార్యదర్శి మౌనిక చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్, పలువురు గ్రామ ప్రముఖులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

డ్వామా పీడీ సూర్యనారాయణ ఆదేశం


హౌసింగ్ అధికారులకు ఆదేశాలిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహించాలని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, డ్వామా ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీని, జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణ ప్రగతిని ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పనుల కల్పన అధికంగా జరగాలన్నారు. నర్సరీని సందర్శించి మొక్కలను పంపిణీకి అనుకూలంగా పెంచాలని ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో ఈ నర్సరీ నుంచి ఇతర ప్రాంతాలకు ఫలాలనిచ్చే మొక్కలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. మునగ మొక్కలు పంపిణీపై వివరాలు తెలుసుకుని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యప్రియ, సిబ్బందిని అభినందించారు. జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణం మరింత పురోగతి ఉండాలని హౌసింగ్ ఏఈ సాయికి చెప్పారు. లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహకం ఇస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏపీడీ వెంకటరమణారావు, సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, పంచాయితి కార్యదర్శి బాపూజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇమాం మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుంది


పెరికీడులోని రైస్‌మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహారావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: తడిచి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దని బాపులపాడు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను మంగళవారం పరిశీలించారు. దాదాపు 40 శాతం రంగు పైబడిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అపోహ పడి దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని నరసింహారావు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచామని, ధాన్యం రైస్‌మిల్లుకు చేర్చేందుకు అయ్యే రవాణా, హమాలీ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారు.

బాలోత్సవం ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 31వ తేదీన జరగనున్న బాలల పండుగ (బాలోత్సవం)ను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బాలోత్సవం ప్రచార పోస్టర్‌ను కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్ అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..బాలోత్సవంలో భాగంగా అకడమిక్, సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన పాఠశాలలు ఈ నెల 25వ తేదీ నాటికి వివరాలు, ఎంట్రీ ఫారమ్‌లు పంపించాలని కోరారు. కమిటీ సభ్యులు అనుమోలు వెంకటేశ్వరరావు, మరీదు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బహుమతి సాధించిన కానూరు గేదె


జాతీయ స్థాయిలో బహుమతి గెలిచిన దేవభక్తుని చక్రవర్తికి చెందిన గేదె

పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన పాల పోటీల్లో కానూరుకు చెందిన గేదె ఎక్కువ పాలు ఇచ్చి ప్రథమ బహుమతి గెలిచింది. మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.బాబూరావు మంగళవారం వివరాలు తెలుపుతూ ఈనెల న తాడేపల్లిగూడెంలో జాతీయ స్థాయిలో మేలు రకం ముర్రా జాతి గేదెల పాల పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో కానూరుకు చెందిన దేవభక్తుని చక్రవర్తికి చెందిన గేదె రోజుకు సగటున 10.33 లీటర్ల పాలు ఇచ్చి ప్రథమ బహుమతి గెలిచిందన్నారు. ఈ సందర్భంగా కానూరులో జరిగిన కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు చక్రవర్తిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎల్‌యూ సిబ్బంది శ్రీను, మురళీకృష్ణ, స్థానిక రైతులు పాల్గొన్నారు.